క్లుప్తంగా

ఆపదలో సీఎంఆర్‌ఎఫ్ ఆసరా



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన కట్ట సతీష్‌కు రూ.60 వేలు సీఎం సహాయనిధి కింద మంజూరు అయ్యాయి. ఈ మేరకు బుధవారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే బాధితుడికి చెక్కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక పేదలు ఆర్థిక ఇబ్బంది పడుతుంటారని, అలాంటి వారికి రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని పేదలు ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్ గౌడ్, కట్ట శేఖర్, రమేష్, మల్లేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శోభారాణి

మాడ్గుల: నానో యూరియా వాడటం వలన తక్కువ ఖర్చుతో పాటు అధిక లాభాలు పొందవచ్చునని ఆమనగల్లు డివిజన్ ఏడీఏ శోభారాణి అన్నారు. బుధవారం మాడ్గుల మండలం పెద్దమాడ్గుల గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నానో యూరియా.. నైట్రోజన్ వినియోగ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. తద్వారా మొక్కల ఎదుగుదల, అధిక దిగుబడిని వస్తుందని తెలిపారు. పర్యావరణహితం– నైట్రోజన్ లీచింగ్ తగ్గి.. మట్టి, నీటి కాలుష్యం తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మించండి

కేశంపేట: వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డీఎస్పీ మండల అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ అన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామ శివారు నుంచి పెద్దవాగు నిండుగా ప్రవహిస్తోందని, దీంతో ఆ రోడ్డులో రాకపోకలకు గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

జీవితాలను మార్చేది విద్య



దాత అందజేసిన పుస్తకాలతో చిన్నారులు

మాడ్గుల: సామాజంలో జీవితాలను మార్చేది విద్యేనని, మంచిగా చదువుకొని.. ఉన్నత స్థాయికి ఎదగాలని జనని ఫౌండేషన్ చైర్మన్ వెంకటయ్య గౌడ్ అన్నారు. బుధవారం కలకొండ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికాన్ని అధిగమించి, విద్యలో రాణించినప్పుడే భవిష్యత్తు ఉజ్వలమవుతుందని తెలిపారు. సర్కారు బడుల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని కోరారు. సైదులు, మల్లేశ్, మైసయ్య, యాదయ్య, మహిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మేముసైతం



డీఎఫ్‌ఆర్‌ఓ జగన్మోహన్‌కు సీడ్‌బాల్స్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణకు మేముసైతం అంటూ కల్వకుర్తి వాసవీక్లబ్ సభ్యులు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో తయారు చేసిన సీడ్‌బాల్స్‌ను.. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జగన్మోహన్‌కు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్, కోశాధికారి రవికుమార్, డిస్ట్రిక్ట్ చైర్మన్ శంకర్, జోన్‌చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చినుకు పడితే జల్లెడే..

- కురుస్తున్న తహసీల్ కార్యాలయం
- తడుస్తున్న దస్త్రాలు
- పెచ్చులూడుతున్న పైకప్పు
- జడుస్తున్న సిబ్బంది



మంచాల తహసీల్దార్ కార్యాలయం (ఇన్‌సెట్లో) పెచ్చులూడుతున్న పైకప్పు

మంచాల: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరే శాఖల్లో రెవెన్యూ ఒకటి. ఇది కీలకమైనది కూడా.. అలాంటి మంచాల తహసీల్దార్ కార్యాలయం.. గట్టిగా నాలుగు చినుకులు పడితే జల్లెడను తలపిస్తోంది. నలుమూలలా ఉరుస్తూ.. కార్యకలాపాలకు తీవ్రం ఆటంకం కలిగిస్తోంది. సిబ్బంది, ప్రజలకు ఇబ్బందిగా మారింది. అందులోని దస్త్రాలు తడిసి ముద్దవుతున్నాయి.

ఎక్కడికక్కడ నెర్రలు

మంచాల మండల కేంద్రంలో 30 ఏళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయం నిర్మించారు. కానీ అనతి కాలంలోనే నాణ్యత లోపం బయటపడింది. భవనం ఎక్కడికక్కడ నెర్రలు వారింది. దశాబ్ద కాలంగా స్లాబ్ కురుస్తోంది. ఒకటి రెండు గదులతో పాటు, వరండాలో పై పెచ్చులు ఊడుతున్నాయి. నీరు కారుతోంది. ఫలితంగా కార్యాలయం శిథిలావస్థకు చేరుతోంది.

పాడవుతున్న విద్యుత్ తీగలు

పదేళ్లగా కార్యాలయం కురుస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో భవనం క్రమంగా మరింత శిథిలావస్థకు చేరువవుతోంది. ప్రస్తుత వానలకు పైకప్పు కురుస్తుండటంతో.. ఫైళ్లు, విద్యుత్ సరఫరా చేసే తీగలు పాడై పోతున్నాయి. పెచ్చులు ఊడుతుండటంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కార్యాలయానికి మరమ్మతులు చేయించాలని సిబ్బందితో పాటు ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై.. తహసీల్దార్ ఎం.వీ. ప్రసాద్ వివరణ కోరగా, మరమ్మతు చేయిస్తే బాగుంటుందని పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



మంచాల: బాధిత కుటుంబ సభ్యులకు సహాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

మంచాల: విధినిర్వహణలో గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ పసుల వెంకటేశ్ కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం మృతుడి దశదినకర్మ నేపథ్యంలో.. 2007 బ్యాచ్ కానిస్టేబుళ్లు రూ.2.13,500లను చెక్కు రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన బూడిద రాంరెడ్డి బీఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.30 వేలు సహాయం అందజేశారు.

రూ.40 వేలు

ఇబ్రహీంపట్నం: కానిస్టేబుల్ వెంకటేశ్ కుటుంబానికి.. ఛాంపియన్స్ క్రికెట్ టీం సభ్యులు అండగా నిలిచారు. బుధవారం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంచాల మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్.. పది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి

కడ్తాల్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన బుధవారం కడ్తాల్ మండలం గానుగుమార్ల తండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన నేనావత్ సేవ్యాకు చెందిన పాడి ఆవులు.. మేత మేసుకుంటూ వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే చనిపోయాయి. వాటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి భానునాయక్.. ఘటనా స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. ప్రమాదం గురించి విద్యుత్ శాఖ అధికారులకు తెలిపి, బాధిత రైతుకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రమాద స్థలాన్ని విద్యుత్ లైన్‌మెన్ బుచ్చిరెడ్డి తదితరులు పరిశీలించారు.



ఆవుల కళేబరం వద్ద రోదిస్తున్న బాధిత రైతు కుటుంబీకులు

ప్రజలు సంతోషంగా ఉండాలి



హోమం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం సుభిక్షంగా ఉండి, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాచర్ల అమరేందర్ అన్నారు. ఎమ్మెల్యే తనయుడు అభిషేక్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని బుధవారం ఇబ్రహీంపట్నంలోని శ్రీ ఈశ్వరాంజనేయ దేవాలయంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ, మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగేశ్, ఎస్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి ప్రభాస్, హరికృష్ణ, భాస్కర్, లిఖిత్, లక్కి, హర్షవర్ధన్, ఆనంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందులో భాగంగా ఆయన బుధవారం మండలంలోని గూడూరు, తీగాపూర్ గ్రామాల్లో డ్వాక్రా భవనాల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సంఘాల కోసం సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. అంతేకాకుండా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం ఉపాధి ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, ఆంజనేయులు, కొమ్ము కృష్ణ, నరేశ్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, రమేశ్, మెండె కృష్ణ, జంగ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి

నందిగామ: గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటన చేసి.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మోత్కులగూడ నుంచి షాబాద్ మండలం కేశారం వరకు రూ.1.20 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణ పనులు, శ్రీనివాసులుగూడ నుంచి మజీద్‌మామిడిపల్లి వరకు రూ.58లక్షల వ్యయంతో నిర్మించే సీసీరోడ్డు పనులకు, అదేవిధంగా బండోనిగూడ నుంచి తండా వరకు రూ.1.25లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలో ఇప్పటికే అనేక రోడ్లు మంజూరు చేశామని వెల్లడించారు. గత పాలకులు రోడ్ల అభివృద్ధిపై ఏ మాత్రం శ్రద్ధ చూపలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా అభివృద్ధి పనులను చేయడమే కాకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఘనంగా బోనాల ఉత్సవాలు

షాద్‌నగర్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విద్యుత్ కాలనీలో బుధవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, బీఆర్ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో పోతురాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మొయినాబాద్: మండల పరిధిలోని ఎల్కగూడలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



షాద్‌నగర్: అమ్మవారి తొట్టెల ఊరేగింపు

బీమాచెక్కు అందజేత



నామినీకి బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి.. స్టేట్ బ్యాంకు అధికారులు బుధవారం ప్రమాద బీమా పాలసీ కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కును అందజేశారు. మంచాల మండలం దాద్‌పల్లి గ్రామానికి చెందిన బుగ్గసమోని భరత్(29).. నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. అంతకు ముందు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇబ్రహీంపట్నం బ్రాంచ్‌లో జనరల్ ఇన్స్యూరెన్స్‌లో ప్రమాద బీమా కింద ఏడాదికి రూ.1000 చెల్లించాడు. నామినీగా తల్లి నీలమ్మను చేర్చాడు. పాలసీదారుడి మృతితో మంజూరు అయిన చెక్కును బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్, మేనేజర్ ఆర్ఎస్ఎల్ లక్ష్మీనర్సింహ శాస్త్రీ.. బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు రాజు, బీమా మేనేజర్ యూసఫ్‌ఖాన్, బీడీఎం పవన్‌లు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం: అసంపూర్తి పనులతో నిలిచిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ పలువురు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ వద్ద భవనాన్ని స్లాబ్ వరకు నిర్మించి వదిలి పెట్టారని తెలిపారు. ఈ కార్యాలయన్ని ఇక్కడే నిర్మిస్తే పాతపట్నం అభివృద్ధి చెందుతుందని భావించిన స్థానికులకు.. ఇది నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్.. నిర్మాణ పనులను ప్రారంభించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో పాత బస్తీవాసులు బండి మహేశ్, రాఘవేందర్, సురేష్, మల్లేశ్, బస్వపురం గోవర్ధన్, రోడ్డ కిష్టయ్య, నాగరాజు, ఐలేష్‌గౌడ్, యంజాల బాల్‌రాజ్, ముత్యాల యాదయ్య, తమ్మళ్ల కృష్ణ, ముత్యాల చందు, శ్యామ్, గుర్జని కుమార్, శ్రీనివాస్, శివ, కౌశలప్ప, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాతబస్తీ వాసులు

బిల్లును అడ్డుకునేవారు.. బీసీ ద్రోహులు

కడ్తాల్: రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే వారు బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిల్లు విషయంలో కొందరు బీజేపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఇది సరికాదన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం త్వరగా ఆమోదించేలా, అన్ని రాజకీయ పార్టీలు చొరవ చూపాలని కోరారు. బిల్లు ఆమోదంలో కేంద్రం జాప్యం చేస్తుందని విమర్శించారు. బిల్లు పాసైతేనే స్థానిక ఎన్నికల్లో బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర నిర్లక్ష్యం వీడాలని, లేని పక్షంలో బీసీల ఉద్యమ కార్యాచరణ తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్, ,హన్మానాయక్, చేగూరి వెంకటేశ్, రామకృష్ణ, యాదయ్య తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

రోడ్డుకు మరమ్మతులు చేపడతాం

చేవెళ్ల: ఆలూరు రోడ్డు పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌కుమార్ అన్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆలూరు రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో మంగళవారం 'ఆలూరు మార్గం.. ఆగమాగం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం స్పందించారు. ఈఈ, జేఈఈలు అజయ్‌కుమార్ అనురాధ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్ రోడ్డును పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిలవటంతో నీరు బయటకు పోయేలా చేస్తున్నామన్నారు. ఈ రోడ్డు మంజూరై కాంట్రాక్టర్‌కు అప్పగించిన అతడి నిర్లక్ష్యంతో పనులు ఆగినట్లు తెలిపారు. నీరు పోతే కానీ పనులు చేపట్టడానికి వీలుపడదని, ప్రస్తుతానికి గుంతలు పూడ్చే పనులు చేపడతామని చెప్పారు. ఆరిన తరువాత రోడ్డు పనులు చేపడుతామని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి
- పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకుల డిమాండ్
- విద్యాసంస్థల బంద్ విజయవంతం



ఆమనగల్లు: పాఠశాలను మూసివేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆమనగల్లు: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా.. విద్యాశాఖకు మంత్రిని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. వెంటనే మంత్రిని నియమించాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. కాస్మొటిక్, మెస్ చార్జీలను చెల్లించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయడంతో పాటు.. నూతన విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆమనగల్లు డివిజన్ కార్యదర్శి శివ, నాయకులు శివకుమార్, రోహిత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి మండలంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా ముగిసింది. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి భానుప్రసాద్, సీఐటీయూ నాయకులు పెంటయ్య, పుష్ప పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

కడ్తాల్: విద్యాశాఖకు మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలోని పాఠశాలలను ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. బడ్జెట్ లేమితో సర్కారు బడుల్లో సమస్యలు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం తేవాలని, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



మంచాల: అరెస్టులో విద్యార్థి సంఘాల నాయకులు

మంచాలలో..

మంచాల: వామ పక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ నేపథ్యంలో ముందస్తుగా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మధ్యాహ్నం వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

విద్యారంగం నిర్వీర్యం

ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీ, కార్యదర్శి ఎర్పుల తరంగ్‌లు విమర్శించారు. విద్యాసంస్థల బంద్ బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సర్కారు బడుల్లో తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, ఆట స్థలం, క్రీడా సామగ్రి, మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సిబ్బంది కొరత వేధిస్తోందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు.. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, విద్యాశాఖకు మంత్రిని నియమించాలని, విద్యార్థులకు ఉచిత బస్ పాసులు, మెస్ కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ లక్ష్మణ్, ఎం రాయ్‌చరణ్, రాకేష్, మధు, వినయ్, సాయిరాం, ప్రణయ్‌లు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పట్టించుకోని అధికారులు



తహసీల్దార్‌కు మెమోరాండం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

కడ్తాల్: పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ముంతాజ్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలపై అధికారులకు విన్నవిస్తున్నా స్పందించడం లేదని ఆరోపించారు. ఇదే విషయమై తహసీల్దార్ ద్వారా, ముఖ్యమంత్రికి విన్నవిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, శంకర్, సత్యనారాయణ, రాజు, విజయ్‌కుమార్, రవి, కృష్ణ, సంగీత ఉన్నారు.